## శబరి

*(శబరి ఒక అనాధ స్త్రీ. పరమ భక్తురాలు. గ్రామములలోని భావములు ఆమెకు గిట్టక అడవులలో సంచరించుచూ ఆనాడు ఆశ్రమములలో స్త్రీలను చేర్చకుండుటచే పొదలచాటునుండి మహనీయులను దర్శించుచూ, వారల శిబిధనలను శ్రవణము చేయుచూ, ఋషులు నడచు మార్గములు యెవరికీ తెలియని సమయములలో వూడ్చుచూ, ముండ్లు తీయుచూ పూలు చల్లుచుండెడిది. ఈరీతిగా పెద్దల సేవలు చేయుచుండ రాముడు తన ప్రార్థన మన్నించి ఋషులకు సహితము లభ్యముకాని రామచంద్రుని సేవాభాగ్యము శబరికి చిక్కెను. శబరి యిచ్చిన రేగుపండ్లను రామచంద్రుడు పరమ ప్రీతితో ఆరగించి, ఆమెకు జ్ఞానబోధ చేసి తనలో లీనమొనర్చుకొనెను. రామభక్తులలో హనుమంతుని తరువాత శబరియే అట్టి అధికార స్థానమునందుకొనెను. సర్వ కర్మలూ రామార్పిత భావముతో చేసిన భక్తివృత్తులే శబరికింతటి అర్హతకు కారణము.)*

అరణ్యములో రామలక్ష్మణులు సీతాన్వేషణ సల్పుతూ, దారిలో కబంధుడను రాక్షసుని వధించి, ముందుకు సాగుచుండిరి. వారి మధ్యకు ఒక వృద్ధస్త్రీ నడుమువంగి, తలపండి, మసకలు కప్పిన కన్నులతో, వణకుతున్న చేతులతో ఒక పండ్లబుట్ట నెత్తిన ఉంచుకొని మెల్లగ నడచుచూ వచ్చుచుండెను. ఈ సుందరరూపులను చూచి మునీశ్వరులు వర్ణించుచున్న ఆ రామలక్ష్మణులు వీరేనేమోనని తలంచి ఒక చెట్టు నీడన నిలచి, బుట్టను క్రిందబెట్టి చేతులు జోడించుకొని రామా, రామా అని స్మరించుచూ నిలచెను. అంత లక్ష్మణుడు యిదియూ ఒక మానవాకారము ధరించిన రాక్షసేయని తలంచెను.

### ఎవరు మీరు?

కాని, రాముడు లక్ష్మణుని తలంపు సరికాదని తెలిపి, ఆ చెట్టు క్రిందనే కొంత తడవు విశ్రమించుటకై ఆగిరి. దానికి అతి సమీపముననే శబరి ఆశ్రమముకూడా ఉండెను. వారి కమలములవంటి కన్నులు, వారి వుంగరములవంటి ముంగురులు, జడలు ధరించి శ్యామవర్ణులైన ఆ ఆజానుబాహులను చూచి యింక తాను భరించుకొనలేకపోయినది. కడుపులో నుంచుకొనలేకపోయినది.

పరుగెత్తిపోయి పాదములపైబడి, 'నాథా! మీరెక్కడనుండి వచ్చుచున్నారు? మీపేరేమి?' అని అడిగెను. శ్రీరాముడు చిరునవ్వుతో, 'అమ్మా! మేము అయోధ్యనుండి వచ్చితిమి. అరణ్యమున నివసించు చున్నాము. నా పేరు రాముడందురు. ఈ నా తమ్ముని లక్ష్మణుడని పిలుతురు' అని చెప్పగనే, 'తండ్రీ! నా చిరకాల వాంఛ తీరెను. జన్మ సార్థకమాయెను. మీ కొరకై, రాత్రింబవలు కనులు కాయలు కాచునట్లు యెదురు చూచినాను. నా ప్రయత్నము ఫలించెను. నా తపస్సు సిద్ధించెను. ఆహా! నేనెంత ధన్యురాలను! ఇది నా గురు గురుకాంక్షయే. దైవ ప్రేరణయే' అని ఆనందబాష్పములు రాల్చుచూ పట్టలేని ఆనందముతో బుట్టను దగ్గర తీసెను. రాముడు, ' అమ్మా! మీ గురువుగారెవరు?' అని ప్రశ్నించగనే, మతంగమహాముని అనియూ, ఈ అరణ్యమున, స్త్రీలకు ఆశ్రమములందు స్థానమునిచ్చుటకు యెట్టి మహనీయుడును అంగీకరించకుండుటచే వారు బోధించు బోధనలను చెట్టుచాటునుండి, పొదలచాటునుండి వినెద ననియు, తెల్లవారకమునుపే, ఋషులు స్నానసంధ్యాదుల నిమిత్తమై నదికి వెళ్ళు దారులను ఊడ్చుచూ, రాళ్ళు, ముండ్లు యేరిపారవేయుచూ, ఈవిధముగా పరోక్ష సేవలు చేసుకుంటూ కందమూలాదులు తిని కారడవులలో కాలము గడుపుచుండెడిదానను. నా మనస్సెరిగిన మహనీయుడు మతంగ మహాముని,'అమ్మా! నీ కాయము పక్వస్థితికి వచ్చినది. ఈవిధముగా శ్రమపడుచుండిన కొంత అలసిపోదువు. నీవు ఆశ్రమమున చేరి విశ్రాంతి తీసుకొమ్మ'ని బోధించెను.

### మహర్షి ఆదేశం

వారి పవిత్ర ఆజ్ఞను శిరసావహించి ఆశ్రమ సేవలు చేసుకుంటూ వుండగా, ఋషి కాయమును వీడగోరి,

ఒకదినము నన్ను దగ్గరకు పిలచి, 'శబరీ! నేను వచ్చిన కార్యము పూర్తి అయినది. నేనిక కాయమును వీడ తలంచితిని. నీవు ఈ ఆశ్రమమునందే వుండుము. కొంత కాలములో శ్రీరామచంద్రుడు ఈ అడవికి వచ్చును. అతనిని ఆశ్రమమునకు పిలచి అతని సేవలు చేసి వారి పాదస్పర్శద్వారా ఆశ్రమమును పవిత్రము గావింపుము' అని ఆజ్ఞాపించెను. అట్టి పవిత్ర గురుమూర్తులు లేని ఆశ్రమమున నేనేమని జీవింతును! నన్నును మీతో గొనిపొమ్మని నేననేకవిధముల ప్రార్థించిననూ గురుమూర్తి యేమాత్రము తృప్తినొందక, రామాగమన నిమిత్తమై నీవిచ్చటే వుండక తప్పదని ఆజ్ఞాపించి ప్రాణములు వీడెను.

'ఆనాటినుండి మీ ఆగమనమునకు అఱ్ఱులు చాచి, కన్నులు కాచి ఈ వృద్ధ కాయముతో కాలము గడుపుచున్నాను. ఓ రామా !ఓ నాథా! ఓ ఆర్త త్రాణపరాయణా! ఓ ఋషిమానససంచారీ! ఈనాటికి నా నోములు పండెను. గురుసంకల్పము ఫలించెను. కొన్ని అడుగుల దూరములోనే ఆశ్రమము కలదు. నాతో దయచేసి పావనము గావింపుడు' అని పాదములపై బడెను. సహజ ప్రేమస్వరూపుడగుటచే, శబరి భక్తిప్రపత్తులకానందించి రాముడు లక్ష్మణునితోగూడా మతంగా శ్రమమునకు వెళ్ళెను.

**రామ సపర్య**

ఆహా! ఆ శబరి ఆనందమునకు హద్దులు, గట్టులు తెగెను. నడువలేని నారీమణికి వేయి ఏనుగుల బలము వచ్చినది. చకచక నడచుచూ నదికి వెళ్ళి చల్లని నీరు తీసుకొని వచ్చి, తాను రుచిచూచి తెచ్చిన ఫలములను రామలక్ష్మణుల ముందుపెట్టి, వారి ముఖకమలములను తనివితీరా చూచుచూ, రామపాదములను కడిగి శిరస్సుపై ప్రోక్షించుకొని, ఆ నీరు త్రాగి,' స్వామీ! నా కోరిక తీరినది. ఇక నేను దేనినిమిత్తమై బ్రతుకవలెను? రామదర్శన నిమిత్తమై బ్రతికితిని. రాములను చూచితిని. ఇక ప్రాణమును తమ పాదములందు చేర్చుకొనుడు. తమ చరిత్ర మునులచే అపారముగా విన్నాను. నేటికి కన్నాను. ధన్యనైనాను' అని ప్రార్థించెను.

రాముడు ఆమె అందించిన ఫలములు అత్యంత ప్రీతితో ఆరగించుచూ, 'అమ్మా! నీ మనస్సెంత మధురమో నీ ఫలములూ అంత మధురముగా నున్నవి. నిజముగా యివి చెట్ల ఫలములు కావు. అడవిచెట్టు ఫలములు యింత మధురముగా ఉండవు. నీ జీవితవృక్షమందలి మనఃఫలములే యివి' అని ఫలముల రుచి వర్ణించుచూ ఆరగించుచుండ లక్ష్మణునికి చాలా ఆనందమాయెను. కారణమేమి, సీతావియోగము కలిగిన దినమునుండి రాముడు ప్రీతితో తనకు తాను అందుకొని ఫలమును భుజించినది తాను చూడలేదు. లక్ష్మణుడు యెంతో బలవంతముతో రామునకు వలిచి, అందించుచుండుటచేత, అదియూ ఒకటో అర్థమో తినుచుండెనే కాని ఆకలి తీరునట్లు, లక్ష్మణునికి తృప్తి కలిగించునట్లు తినలేదు. ఈనాడు ఈ శబరి చెట్టుచెట్టు క్రిందపడిన ఫలములను రుచిచూచి మట్టి తుడిచి పరిశుద్ధముగా మధురఫలములనే దాచిపెట్టి రాముని నిమిత్తమై నిత్యము యెదురుచూచి కడకు రామ ప్రసాదమనే భావనతో తానారగించి, తిరిగి క్రొత్త ఫలములను యేరి దాచి ఉంచేది. ఆ అలవాటుతో. శబరి ప్రేమరసమును ఆ ఫలరసముతో యేకపరచటముచేత, అతి మధురరసముగా ఆ ఫలములను రామచంద్రుడు ప్రీతితో తృప్తితీర ఆరగించుచున్నాడని లక్ష్మణుడు అమితానందపడెను. శబరి భక్తికి మెచ్చుకొనెను. ఆమె వృద్ధాప్యములో వున్న దైవరసమును అర్థము చేసుకొని ఆనందించెను.

శబరి చేతులు జోడించుకొని, 'ఓనాథా! నేను నీచజాతిలో జన్మించిన స్త్రీని, మందమతిని, మూర్ఖురాలను, ఏవిద్యలేని అజ్ఞానిని, నేనేమని వర్ణింతును. అధమాధములలో అధమురాలను. అశక్తురాలను. మాటల పొందిక తెలియదు. తెలివితేటలు శూన్యము. తపశ్శక్తి లేదు. కేవలము దైవప్రీతి తప్ప అన్యశక్తులలో అట్టడుగున పడిన నన్ను ఆదరించి, ఆనంద మందించిన నీ కరుణ అపారము. నీ కరుణే నన్ను అనుగ్రహించెను తప్ప నా భక్తిశక్తులు కావు' అని అనేకవిధముల రామచంద్రుని ప్రేమ, దయలను వర్ణించుచూ వచ్చెను.

**భక్తే ప్రధానం**

ఈమాటలు వింటున్న రాముడు శబరి శిరస్సు నిమురుతూ, 'అమ్మా! నాకు భక్తి ఒక్కటే ప్రధానముగానీ

అన్యవిద్యలు, తెలివితేటలు, జన్మ, వంశాలు నేను లెక్కచేయను. సమస్త తపశ్శక్తులకంటె ప్రేమపూర్వకమైన భక్తియే నాకు మధురము. నేను దానిని మాత్రమే ఆశింతును. జలము లేని మేఘమువలె, పాలివ్వని గోవువలె, భక్తిలేని మనుజుడు యెంతటివాడైననూ నాకు, భగవత్ప్రీతికి, అతి దూరమైనవాడే. ఓ శబరీ! నవవిధ భక్తిమార్గములందు యేమార్గమునవలంబించినా చాలు. అయితే నీవు నవవిధ మార్గములను అవలంబించితివి. ఇక నీకంటె అధికులు నాకెవ్వరును కనిపించుట లేదు.

హృదయస్థానమునుండి వచ్చిన, ప్రవహించుచున్న, నీ నిర్మల, నిశ్చల, నిస్వార్థ ప్రేమ ప్రవాహమే నన్ను అన్నివిధములా తృప్తిపరచెను. స్వప్నమందైననూ నీవు పరులను దూషించలేదు. ఇట్టి స్వచ్ఛచిత్తముకంటె మించిన చిత్తము వేరొకటి లేదు. మంచికి పొంగి, చెడ్డకు క్రుంగికృశించే చంచలస్వభావము నీకు అతి దూరము. నీవు అన్నివిధములా ధన్యురాలవు' అని రాముడు ఉపదేశించిన వచనములను శబరి వింటూ, 'రామా! దైవమనస్సును ప్రీతిగావించుటకంటె భక్తునకు మరొక మార్గము లేదుకదా! ఎవరు ప్రీతి పడిననూ పడకపోయిననూ నీ ప్రీతిబడయుటకంటె నాకు వేరు స్వర్గమెందునూ లేదు.

'నాథా! నీ మనస్సునకు తృప్తిగావించుటకంటె నాకు కావలసినది వేరొకటి లేదు. ఈనాటికి నా తండ్రి, నా పరమాత్మ, నా ప్రాణనాథుడు, జగన్నాథుడు, లోకనాథుడు, విశ్వనాథుడునాకు ప్రసన్నమయ్యెకదా! ఓ జానకీవల్లభా!' అని వర్ణించి జానకిని జ్ఞప్తికి తెప్పించెను. అంత 'శబరీ! ఇంతసేపూ యే విచారమూ లేక ఆనందములో మునిగిన మమ్ము తిరిగి విచారమునకు గొంపోతివా!' అని రాముడు పలుకగనే, శబరి దిగ్గున తలయెత్తి,' నాథా! ఏమంటిని, నా అపరాధము క్షమింపుడ'ని పాదములపై బడెను. అంత, రాముడు,' శబరీ! జానకి సమాచారము నీకేమైనా తెలియునా? ఆమెను గురించి నీవేమైననూ వినియుంటివా?' అని అడుగగనే, 'రామా! జానకిని యెరుగనా! రామతత్త్వమెరిగిన ప్రతి స్త్రీ జానకి తత్త్వమెరగక ఉండదు. ఆ మహాసాధ్వీమణి, వనితారత్నము, స్త్రీజాతి జ్యోతి, ఆ తల్లి ఎంతటి అదృష్టవంతురాలో!ఆమె రాముని నీడయేకదా! రామా! మతంగమహర్షి తెలిపిన సీతాతత్త్వమును, మీకు తెలియనిది కాదు, అడిగితిరి కనుక విన్నవింతును.

**కల్పించుకున్న నెపం**

రాముడు రాక్షససంహారము నిమిత్తమై యేదో ఒక నెపమును కల్పించుకొని మంథర, కైకలందు మాయను ప్రవేశింపజేసి, సీతా లక్ష్మణులతో అయోధ్యను వదలి అరణ్యములో ప్రవేశించెననియు, కొంత కాలము దండకారణ్యమందలి ఋషులను అనుగ్రహించి వారి తపస్సాధనలకు అడ్డు తగులు రాక్షసులను హతమార్చి ఋషి ఆశ్రమములను కాపాడుతూ, రాక్షసుడైన రావణునితో కొంత సంబంధము యేర్పరచుకొనుటకై కొన్ని కృత్రిమ నాటకములాడుననియూ, ఆ నాటకములో రావణుడు సీతాపహరణము గావించునటుల రాముడే సంకల్పము చేయుననియూ, రావణుడు అపహరించిన సీత నిజమైన సీతకాదనియూ, అయితే లోకదృష్టికి ఆమెయే సీతగా రూపొందుననియూ, ఈ నెపముతో రాముడు సీతాన్వేషణ సల్పుతూ మన ఆశ్రమము ప్రవేశించుననియు, అప్పుడు నీకు మహాభాగ్యము చేకూరుననియూ మతంగమహర్షి నాకు తెలిపెను.

అంతియేకాక మన ఆశ్రమమును వీడి మన ఆశ్రమమునకు సమీపముననున్న ఋష్యమూక పర్వతముపై అన్నతో ద్వేషము చేసుకొని అరణ్యవాసము గావించుచున్న సుగ్రీవునితో స్నేహముగావించుకొని అతని ద్వారా సీతాన్వేషణ సల్పి, రావణ సంహారము జరుపుననియూ తెలిపెను. లీలానాటక సూత్రధారివైన నీ చర్యలను వారానాడే తెల్పిరి. నీ నటన లోకనటన, నీ సంకల్పము లోకకళ్యాణము. అంతా నీ సంకల్పమే తప్ప వేరు కాదు. నీ సంకల్పము లేక యే చిన్న కార్యమూ జరుగదు. నాథా! ఏమి తెలియనివానివలె నటించుచూ, సీత నిమిత్తమై విచారించునటుల నటన చేయుచున్నావు. పామరులు, అవిశ్వాసులు, నాస్తికులు సామాన్య దృష్టితో చూతురేమో కానీ, దైవత్వమును తెలుసుకొన్నవారు, ఆత్మవిశ్వాసముగల సాధకులు, భక్తులు నీ నటనలను నమ్మరు. నీ సంకల్పమునకు విరుద్ధముగా నడచుటకు యెట్టివారికీ చేతకాదు. మంచియైననూ, చెడు అయిననూ వారిలోని

భావములుకూడా ఆయా సమయములకు తగిన రీతిగా నీవే సంకల్పింతువు. కాని, వారు ఏమాత్రమూ కర్తలు కారు. అజ్ఞానులు కొందరు మేము మా పనులకు కర్తలమని భావింతురు, అదే అజ్ఞానము.

రామా! నా అతిభాషణ క్షమించి నన్ను అనుగ్రహింపుము' అని పాదములపైబడెను. అంతలో యోగాగ్ని అమె దేహమును భస్మము గావింప ప్రాణము రాముని పాదములలో చేరెను.